# నారాజీనామా

ఆ నాడు ఒక మహానాయకుడు బెజవాడ రావడంవల్ల రైళ్లు, కార్లు ఖాళీ లేకుండా పోతున్నాయి. రాజకీయ సభల్లో ఉద్యోగస్థులు పాల్గొనరాదనే నియమం ఉన్నా మధు కూడా బయలుదేరాడు. లక్షలాది ప్రజలు ఆ నాయకుని దర్శనార్థం తండోపతండాలుగా బయలుదేరడం, తను ఉద్యోగం చేస్తున్న అధికారసంస్థ ఆరోజు సెలవుదినంగా ప్రకటించడం, పిరికిపందయైన మధుని కూడా ప్రోత్సహించినాయి. అసలు మధు వెనకాముందూ ఆలోచించే రకం కాదు. అయినా అయిదు సంవత్సరాల మాస్టరీగిరి అతన్నీ విధంగా మార్చివేసింది.

ఆదరా బాదరా పరుగెత్తికెళ్ళాడు మధు స్టేషన్‌కి. రైలు వచ్చేస్తోంది. ఇంకా టికెట్ కొనలేదు. పైగా చేతిలో ఒక బరువైన సంచి. ప్లాట్ ఫారంమీద అంతమంది జనంలో పరుగెత్తడం అసభ్యత. పైగా విద్యార్థులు కూడా అక్కడక్కడ ఉన్నారాయె. దగ్గిరలో విద్యార్థి సుందరం కన్పించాడు.

'సుందరం. వెళ్ళి ఇంటర్ టికెట్ ఒకటి బెజవాడకు తీసుకురా' అంటూ అరిచాడు.

సుందరం అదివరకు దాకా ఇటు తిరిగున్నవాడల్లా అటువైపు తిప్పుకున్నాడు ముఖం ఏమీ విననట్లు.

'నిన్నే సుందరం'

రైలు దాపుకు వచ్చేసింది. మధు ప్రక్కనే ఉన్న ఓ పెద్దమనిషి 'మీరు తొందరగా వెళ్ళకపోతే ఇందాకనుంచీ పరుగెత్తికొచ్చిన శ్రమ కూడా నిష్ఫలం అవుతుంది.' అని హెచ్చరిక చేశాడు.

మధు కొద్దిదూరం చకచకా నడిచేటప్పటికలా ఓ చిన్న వెధవ కన్పించి 'మీరు బండీ ఎక్కండి మాస్టరుగారూ. నేను టికెట్ తెచ్చిపెడతా' నన్నాడు.

'సరే' నంటూ మధు ఇంటర్ లో కెక్కాడు. రైలు కదిలింది. కాని ఆ చిన్న వెధవ రాలేదు. కిటికీలోంచి తొంగి చూశాడు. ప్లాట్ ఫారంమీద ఎవరూ లేరు. జేబుదొంగ లుంటారని డబ్బు పదిలం చేసుకున్న మధు చేతులారా డబ్బు దొంగకప్పచెప్పాడే! ఎంత మోసం! పైగా ఆ దొంగ డబ్బు కాజేయడమే కాక తన్ని కూడా ఒక నేరస్థుని జేశాడే!

మధు పెట్టం తా కలయ చూశాడు. ఎక్కడా పిసరంత ఖాళీలేదు. ఒక్క చోటమాత్రం ఆసీనుడై యున్నాడు తన క్లాసులో చదివే కుర్రాడే ఠీవిగా. ఒక నిముషం చూశాడు 'మాస్టరుగారూ కూర్చోండి' అంటాడేమోనని. కాని అట్లా జరగలేదు. మధు కొంచెం చనువుతీసుకుని 'ఒరేయ్ నువ్వు కొంచెం లే' అన్నాడు. 'సారీ సార్' అన్నాడతడు ముఖం ప్రక్కకు త్రిప్పుకుంటూ. మధుముఖంలో నెత్తురు చుక్కలేదు. పైగా దేశీయసాంప్రదాయం ప్రకారం ప్రక్కనున్న ఓ పెద్దమనిషి.

'అవన్నీ పూర్వం రోజులండీ మాస్టరుగారూ ఈనాటి విద్యార్థులు' అంటూ ఉండగానే ఒక కాలేజీ కుర్రవాడిలాగా ఉన్నవాడొకడు అందుకుని 'అట్లా అంటె ఊరుకోను. ఈనాడు గౌరవా గౌరవాలు ఒకళ్ళుకోరితే వచ్చేవి కావు. మనిషినిబట్టి ఉంటాయి.' అన్నాడు.

సన్నటి గొంతుకలో మరొకడు 'డబ్బు




రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్‌వారికై ఇండియాలో తయారుచేయబడినది

R.P. 87-610 TL

లేని వాడు బోటు ముందెక్కుతాడు' అన్నాడు.

'మొత్తంమీద ఉపాధ్యాయులంటే ఈనాడు విద్యార్థులకు...'' అని ఇంకో పెద్దమనిషి అనబోతుండగా మధు రెండో వైపుకు వెళ్ళి...

'కొంచెం జరగండి' అని ఒకాయన్ని అడిగాడు. జరిగినదంతా పరిశీలించిన మీదట దయగలిగిందో లేకపోయినా ఇచ్చేవాడేమో—రండి. కాసేపేగా అట్లాగే ఇరుక్కుని కూచుందాం.' అన్నాడు.

చాలా సేపటివరకు మధు తల ఎటూ త్రిప్పకుండానే కూచున్నాడు అతని విద్యార్థి కూడా కదలకుండా నేకూర్చున్నాడు. మధు ముఖంలోకి ప్రయాణీకుల్లో కొందరు అప్పుడప్పుడు చూడటం అతని మనస్సును కలవరపరచింది. కలవరపరచడమే కాదు బెజవాడ జేరుకునేవరకు అతనిమనస్సు ముందు ఎట్లా అసలు అతను ఆ ఉద్యోగంలో ప్రవేశించిందీ, ఎన్నిసార్లు రాజీనామా నిచ్చి బయటపడుదామనుకున్నా రాలేకపోయిందీ అన్నివిషయాలు ఒక్కసారి సినిమాలో చూసినట్లు కళ్లముందు ప్రత్యక్షమయినాయి.

మధు ఉపాధ్యాయుడవుతాడని ఎవరూ కల్లోకూడా అనుకోలేదు. అతని తలిదండ్రులు అతడొక పెద్ద ఉద్యోగి అవుతాడనుకున్నారు. మధు తల్లికి కొడుకు పెద్ద ఉద్యోగం చేస్తుంటే చూడాలనుకుండేది. తమాషాకు తనకొడుకు కలక్టరవుతాడంటుండేది తండ్రి ఎందుకు కాకూడదూ అంటూండేవాడు. మేనమామకి మాత్రం మధు ఓ పెద్ద ప్లీడరు చెయ్యాలని వుండేది. కనీసం రెవిన్యూ ఇన్‌స్పెక్టరన్నా అవడా అంటూండేది మధు అక్కగారు. 'మా అన్నయ్యే గవర్నరవుతాడంటూండేది' మధు చెల్లి సుశి. మధు నివసించే గ్రామంలోనివారు మధుకు 'డాక్టరీ చెప్పించండి' అని కొందరు, 'ఇంజనీరుకు పనికివస్తాడేమో చూడండి' అని మరికొందరు 'ప్లీడరయితే స్వతంత్రంగా జీవించవచ్చు' నని మరికొందరూ సలహా లిస్తూండేవారు

అన్ని అవకాశాలుండికూడా మధు డాక్టరూ కాలేదు ప్లీడరూ కాలేదు. లేక ప్రభుత్వపు ఉద్యోగీ కాలేదు. స్వయంగా ఉపాధ్యాయవృత్తినే వరించాడు.

మధు శాంతిస్వంతభావుడు. ప్రశాంతంగా జీవితాన్ని గడుపవలెనని కోరిక గలవాడు. పెద్ద పెద్ద నాయకులు ఉపాధ్యాయవృత్తిని జాతిని నిర్మించి జీవం పోసే వృత్తియని పొగడడం అతడ్ని భ్రమింపజేసింది. అదికాకుండా అతడు చదువుకునే రోజుల్లో అతని గురువుగారైన సాంబమూర్తిగారి జీవితం అతడి మీద మంచి ప్రభావం కలుగజేసింది. సాంబమూర్తిగారు క్లాసులోనికి రాగానే విద్యార్థులంతా వినయపూర్వకంగా నుంచోడం, ప్రేమతో, దయ తొణికిసలాడే మాటల్లో విద్యార్థుల్ని పలకరించడం, పాఠం, మొదలెట్టినదగ్గిరనుంచి చివరవరకు అందరికీ అర్థమవుతున్నదో లేదో మాసుకుంటూ బోధించడం, విద్యార్థులకు ఏకష్టం కలిగినా ముందు మూర్తిగారి దగ్గిరకు వెళ్లి విన్నవించుకోవడం ఇత్యాది రసవత్తరమయిన ఘట్టాలనేకం ఈనాటికీ మధుకు గుర్తున్నాయి. అమాయకులయిన విద్యార్థులనుండి వచ్చే నిష్కళంకమైన ప్రేమ, భక్తి, విశ్వాసాలు స్వీకరించి వారి పురోభివృద్ధికి తోడ్పడంలో ఉన్న ఆనందం మరి ఇంకే ఉద్యోగం చేసినా ఉండదని నిర్ణయించుకున్నాడు. ఆవృత్తిలో ఉండే విశ్రాంతి జ్ఞానాభివృద్ధికి తోడ్పడే అవకాశాలు, స్వాతంత్ర్యము అతడ్ని ఆవృత్తిలోనికి ఆహ్వానించాయి. ఏదో కొద్దిగా ఉన్నకుటుంబంలోనుంచివచ్చినవాడవటంవల్ల పెద్దగా సంపాదించాల్సిన

(22-వ పేజీ చూడండి)



# నా రాజీనామా

(5-వ పేజీ తరువాయి)

అవసరంకూడా అప్పట్లో అతడికి లేక పోయింది.

మధు ఉపాధ్యాయుడయ్యాడు. వివాహంకూడా అంతకుపూర్వమే అయిపోవడంవల్ల ఇంక అతను నిరపాయంగా జీవితం గడపొచ్చు అనుకున్నాడు. కాని అయిదు సంవత్సరాలు గడిచేటప్పటికల్లా ఆ వృత్తిమీద విసుగు పుట్టించే ఘట్టాలు అనేకం చూశాడు. ఉపాధ్యాయవృత్తి తను మొదట్లో అనుకున్నంత స్వేచ్ఛాయుతమైనది కాదని తేలిపోయింది. అధికార ప్రాబల్యం అందులోనూ అనుకున్నంత దానికంటె ఎక్కువే ఉందని గ్రహించాడు. రాజీనామా ఇచ్చేద్దామనుకున్నాడు కాని ఆనాటి కానాడు అతనిలోని ధైర్యాన్ని మ్రింగివేసింది వృత్తి.

అది అతని మొదటి సంవత్సరం. ఆ సంవత్సరంలో బ్రిటిష్ పద్ధతుల్లో తర్ఫీదుపొందిన ఉన్నతోపాధ్యాయుని క్రింద పనిచేయవలసివచ్చింది. తన మంచితనాన్ని అతగాడు ఉపయోగించుకోకపోగా దుష్టశక్తులను దరిచేరనిచ్చాడు. విద్యార్థులకు మధుపట్ల గల అచంచల విశ్వాసంతో కొట్టుకొనివచ్చాడు గాని లేకపోతే రాజీనామా నిచ్చేసేవాడు. దాంతో విద్యాసంస్థల్లో కూడా అసమానత్వము, అధికార ప్రయోగానికే అవకాశం హెచ్చు ఉండడం అతడు సహించలేకపోయ్యాడు.

విద్యార్థుల విషయంలో మధుకు గాఢమైన విశ్వాసం ఉంది. తలిదండ్రులు ఉపాధ్యాయుడు పిల్లల విషయంలో చేసే కృషికి ఎప్పుడూ హర్షం వెలిబుచ్చుతారనే ధీమాలో ఉండేవాడు. ఆ ధీమాతోనే ఒకనాడు నేరస్థుడైన విద్యార్థిని కొట్టాడు. ఆ గ్రామంలో ఆ విద్యార్థి తండ్రి పలుకుబడిగల నాయకుడవడంవల్ల మధు ఉనికికే మోసం వచ్చింది. ప్రాణంకోసం పారిపోయి రావాల్సొచ్చింది.

పాఠశాలా వాతావరణాన్ని రాజకీయాలతో కలుషితం చేయకూడదనే మన స్తత్వం కలవాడు మధు. కాని ఒక సంవత్సరంలో అతడు రాజకీయాలతో సంబంధంగల ఒక ఉన్నతోపాధ్యాయుని క్రింద పనిచేయాల్సివచ్చింది. మధుని విద్యార్థులలో చులకన చేయాలనే దృష్టిలో అతడు తన రాజకీయ పక్షానికి చెందిన విద్యార్థులను అతని మీదకు తోలడం మొదలుపెట్టాడు. అది అతనికి చేతకాకపోయినా మధు విద్యార్థులలో తన స్థానాన్ని నిలవదొక్కుకోటానికి చేసిన ప్రయత్నాలలో అతని బుర్ర పోయింది.

ఆశలన్నీ పోగా మధుకి ఒకే ఒక ఆశ నిలబడిపోయింది. తనక్రింద చదివిన విద్యార్థులు పెద్దయి దేశ నాయకులుగాను పెద్ద పెద్ద ఉద్యోగస్థులుగాను అయిననాడు తను వాళ్ళని చూసి గర్వపడవచ్చునని, వాళ్లు తనకు కృతజ్ఞులుగా యుంటారనిన్నీను. అందుకే తన అయిదేళ్ళ జీవితంలోను అటు ఉన్నతోపాధ్యాయునికి ఇటు గ్రామస్థులకు ఎదురు నిలబడి లేతమనస్సుల పురోభివృద్ధికి హృదయపూర్వకకృషి సల్పాడు. బంధువులు, మిత్రులు తన ఉద్యోగాన్ని చూసి హేళన చేస్తున్నా విద్యార్థులమీద తన విశ్వాసాన్ని కోల్పోలేదు.

క్రమంగా మధుకు విద్యార్థులమీద నున్న విశ్వాసంకూడా సడలింది. దేశంలో వస్తున్న మార్పులన్నీ పాఠశాలల్లోకూడ ప్రవేశించి లేత మనస్సులనుకూడ పెడదారిని పెట్టిస్తున్నట్లు గమనించాడు.

ఒకనాడు మధు తన తరగతి పిల్లలను, అడిగాడు. 'ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య సంబంధం ఎట్లా ఉండాలి?' ప్రకాశ్ చివాలున లేచి, 'ఉపాధ్యాయులకు జీతాలు మేము ఇస్తున్నాము కొబట్టి మమ్మల్ని కొట్టకుండా మా ఇష్టప్రకారం చదువు చెప్పాలండీ' అన్నాడు. మధు చమత్కారంగా అన్నాడు. ఒరేయ్. మీ తల్లిదండ్రులు మాకు జీతాలిస్తున్నారు కొబట్టి వాళ్లకు లోబడి ఉండాలంటున్నారు. మీరు మీరిస్తున్నారు కొబట్టి


"ఉమా" ఆభరణములు 10 సంవత్సరములు గ్యారంటీ

10 Years Guaranteed




"ఉమా" గాజులు ధరలు జత 1 కి

| | |
|---|---|
| 2.0 ఇంచిల సైజు | రు 8-0-0 |
| 2.2 ఇంచిల సైజు | రు 8-8-0 |
| 2.4 ఇంచిల సైజు | రు 9-0-0 |

సాధారణ వి. పి. పార్శిలు చార్జి రు 1-2-0

అసలు బంగారపురేకు గొట్టము లోపాపు కడ్డీకి తొడగి అతికించి తయారుచేయబడినవి. కాల్చినను బంగారము చెదరదు. "ఉమా" ఆభరణములు మహా ద్రావకములో వేసిన 5 నిమిషములకు బంగారము ప్రత్యేకముగా కనిపించును.


అట్లు రుజువు కానియెడల రు 500 లు బహుమానము ఇచ్చెదము.

కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

ఉమాగోల్డు కవరింగు వర్క్సు

ఉమామహల్ : : మచిలీపట్టణము

ఉమాగోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు.

మీను లోబడి ఉండాలంటున్నారు. మాపై అధికారులు జీతాలు వాళ్లు ఇస్తున్నారుకాబట్టి వాళ్ళకు లోపడిఉండాలంటున్నారు. మేము ఎవరికి లోబడి ఉండాలో అర్థంకావడం లేదు.' చమత్కారంగా మధు తప్పించుకున్నాడు గాని నేటిపిల్లల హృదయాల్లో ప్రవేశించిన మార్పు గ్రహించలేకపోలేదు.

నేటి విద్యార్థుల దృక్పథం అతనికి పూర్తిగా అర్థమయింది. తమను ప్రేమించి తమ పురోభివృద్ధికై పాటుబడుతున్న ఉపాధ్యాయుని యెడ కన్న తమకు అప్పుడప్పుడు కన్పించి సలహానొసంగే బయటి నాయకుల యెడనే వారికి విశ్వాసమెందని గ్రహించాడు. ఆనాడు ప్లాటుఫారంమీద, రైలుపెట్టెలో జరిగిన విషయాలు చక్కటి నిదర్శనాలనుకున్నాడు. మధు ఆవిశ్వాసం, కృతజ్ఞత లేనిదే తనెందుకా వృత్తిలో నుండటం ? హాయిగా విజ్ఞానాభివృద్ధి చేసుకుంటూ స్వతంత్రంగా జీవించగల తనకు ఒకరి క్రింద దాస్యమెందుకు ?

బెజవాడనుంచి తిరిగివచ్చాడు కాని మధు మనస్సు కుదుటపడలేదు చలించింది. చలించడంలో పూర్తిగా చలించింది. మనస్సు ఎంతప్రయత్నించినా మారే సూచన కన్పించలేదు.

కలక్టరు చెయ్యడా అని ఆశపడిన మధు తల్లి కనీసం మాస్టరీ గిరి అన్నా చేస్తూండమని బ్రతిమాలింది. తండ్రి కూడా చెప్పి చూశాడు. బంధువులంతా ఆ ఉద్యోగానికేం రాజాది అని నచ్చచెప్ప ప్రయత్నించారు. గ్రామస్థులు హాయి అయిన ఉద్యోగాన్ని వదలద్దన్నారు. కొంచెం నాయకులమనుకొన్నవారు దేశానికి ఉపాధ్యాయుల అవసరం ఎంతో నిరూపించ ప్రయత్నించారు. భార్య వదలద్దంటే వదలద్దని ప్రాధేయపడ్డది.

అంతరాత్మ ప్రబోధాన్ని ఎవరూ ఆపలేరు. మధు తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. మధు రాజీనామా ఇటు సోదరోపాధ్యాయుల్ని అటు బంధవుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మధు మనస్సు ఉపాధ్యాయునికి సంఘంలో గౌరవస్థానాన్ని కల్పించే మార్గాలపై తిరిగింది. వారం రోజులు గడిచిపోయినాయి. అతని రాజీనామాను పై అధికార్లు ఆమోదించరని అందరూ అనడం మధు మనస్సుకు అశాంతిని కలుగజేసింది. తెల్లవారితే దానికి సంబంధించిన వర్తమానము పోస్టులో వస్తుందని ప్రయివేటుగా మధుకి తెలిసింది.

మధుకు స్వగ్రామంలో బ్రహ్మాండమైన సన్మానం ఏర్పాటు చేయబడింది. సభాస్థలి చక్కగా పుష్పాలతోనూ రంగు కాగితాలతోను అలంకరింపబడింది వేదికపై మధుని ఆశీనుణ్ని చేశారు. గ్రామంలోనివివిధ వృత్తుల్లోని ఉద్యోగులు సన్మానపత్రాలను సమర్పించారు. మధు మెడలో మోయలేనన్ని పూలమాలలు వేశారు. మధు గ్రామంనుంచే వెళ్లిన మంత్రి కూడా ఆనాటి సభకు హాజరయి ఉపాధ్యాయునికి శాసనసభల్లోను ఇతర ముఖ్య సంస్థల్లోను ప్రాతినిధ్యం ఇచ్చేటట్లు చూస్తానని హామీ ఇచ్చాడు. మధు ఉన్నతాధికారి కూడా సభకు హాజరయి ఉపాధ్యాయుని జీతం హెచ్చు చేస్తానని వాగ్దానం చేశాడు. సంఘంలో ఉపాధ్యాయుని గౌరవాన్ని ఇనుమడింపజేసే పద్ధతుల్ని కొన్నిటిని తనకు సూచించవలసిందిగా కోరి రాజీనామాను ఉపసంహరించుకోమని కోరాడు. విద్యార్థులు కూడా కొంతమంది హాజరయి తమ గురుకట్నాలను సమర్పించారు. పత్రికారచయితలు ఉపాధ్యాయ సమస్యలపై విపులమైన రచనలుసాగించి ప్రచారం చేస్తామని ఉద్ఘాటించారు. మధు అందరి మన్ననలను స్వీకరించి తగురీతిగా సమాధానం చెప్పాడు. జయ జయ ధ్వానాల మధ్య సభ ముగిసింది. మధు గౌరవార్థం ఆనాడు అతడు వ్రాసిన 'ఉపాధ్యాయు' డనే నాటకాన్ని ప్రదర్శించారు విద్యార్థి నాట్యమండలివారు.

నాటకం పూర్తిఅవకముందే మధు తనకై ప్రత్యేకముగా ఏర్పాటు చేయబడిన కారులో ఇంటికి బయలుదేరాడు. దారి మధ్యలో ఉండగానే అతనికి భుజము పైన బలమైన దెబ్బలు తగలడంవల్ల చివాలున లేచి నుంచున్నాడు. విప్పారిన కండ్లకు భార్య అప్పుడే పోస్టుమన్ తెచ్చిన కవరుతో కన్పించింది. కవరుచింపి చూసుకునేసరికి.

'నీరాజీనామా అంగీకరించబడింది' అని తన ఉన్నతాధికారి వ్రాసిన వాక్యం మాత్రం ఉంది. అప్పుడర్థమయింది మధుకి తను ఒక దివ్యస్వప్నంలోంచి వచ్చినట్లు.

★

**రత్నపురుషవేషాం**

ధాతు నష్టమును హరించును అత్యుష్ణము. నరముల బలహీనత, గుండెదడ, అతిమూత్రము మొ॥ మేహవ్యాధులను హరించి మిక్కిలి బలమును, కాంతిని, మనోత్సాహము నిచ్చును. అనేక యోగ్యతా పత్రములుగలవు. డబ్బా రు. 2/- పోస్టేజి 0-14-0,

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు విజయవాడ-2.




★

# ఫోనిక్సు పంకాలు

**(A. C. & D. C.)**

సోల్ ఏజెంట్లు:

RM. S. & Co., Ltd, 16, Broadway, MADRAS.

విశాఖపట్టణం అండ్ తూర్పుగోదావరి జిల్లాలకు ఏజెంట్లు :-

మెస్సర్సు మాకడవల్ అండ్ కంపెని లిమిటెడ్.

విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను